

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:34 (గురువారం సాయంత్రం)
సహార్: 4:54 (శుక్రవారం ఉదయం)



ఢిల్లీలో మీనాక్షి నటరాజన్‌ను కలిసిన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి తదితరులు

మీనాక్షి నటరాజన్‌తో నిర్మలాజగ్గారెడ్డి భేటి

- ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత విషయాలపై చర్చించిన టీజీఐఐసీ చైర్‌పర్సన్

సంగారెడ్డి, ఆంధ్రజ్యోతి, మార్చి 26 : తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో టీజీఐఐసీ చైర్‌పర్సన్, సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి బుధవారం ఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన సంస్థాగత విషయాలపై వారు చర్చించారు.

బయోమెట్రిక్ కొందరికేనా!

సంగారెడ్డి అర్బన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదు. కలెక్టర్ క్రాంతి మంగళవారం ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేయగా ఈ విషయాలు వెలుగు చూశాయి. ఈ క్రమంలో పది మంది వైద్యులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడంతో పాటు మరో ఇద్దరిని డీఎంఈకి సరెండర్ చేసిన విషయం విధితమే.

జీజీహెచ్, ఎంసీహెచ్ ఆస్పత్రుల్లో డాక్టర్లతో పాటు అన్ని క్యాడర్ల వైద్య సిబ్బంది, ఉద్యోగులు కలిపి సుమారు 600 మందికిపైగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, కొంతమంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మాత్రమే బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేస్తున్నారు. సగానికిపైగా సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు విధానం లేదు. దీంతో ఎవరు ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు వెళ్తున్నారో తెలియని పరిస్థితి నెలకొన్నది. మెజారిటీ డాక్టర్లు హైదరాబాద్ నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం 9 నుంచి 4 గంటల వరకు ఆస్పత్రిలో ఉండాలి. కానీ కొందరు 10.30 గంటలకు వచ్చి ఒంటి గంట కాక ముందే తిరుగు పయనమవుతున్నారు. ఒకరిద్దరు స్పెషాలిటీ డాక్టర్లు కనీసం రెండు గంటలు కూడా ఓపీలో పేషెంట్లను చూడడం లేదు. టీ-హబ్‌లో పనిచేసే కొందరు వైద్య సిబ్బంది విధులకు ఎగనామం పెడుతున్నారు. అటెండెన్స్ రిజిస్టర్లలో సంతకాలు చేయడమే లేదు. పనిచేసేది ఒకరైతే మరొకరు వెళ్లి ఆ ఉద్యోగి సంతకాలు చేస్తున్నట్టు తెలిసింది. విధులకు రాకపోయినా మరుసటిరోజు వచ్చి సంతకాలు చేస్తున్నారు. అటెండెన్స్ రిజిస్టర్లలో కొందరు అడ్వాన్స్‌గా సంతకాలు చేస్తున్నారంటే పర్యవేక్షణ ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉద్యోగులందరికీ బయోమెట్రిక్ హాజరును పక్కాగా అమలు చేయడం ఒకటే మార్గం.

అందరికీ అమలు చేస్తాం



కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరలో జీజీహెచ్, ఎంసీహెచ్‌లో పనిచేసే అందరికీ బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేస్తాం. ఏస్థాయి వారైనా సమయపాలన పాటించాల్సిందే. ఎవరికీ మినహాయింపు లేదు. సమయపాలన విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం.

-అనీల్‌కుమార్, సూపరింటెండెంట్, జీజీహెచ్

ఉపాధి పనిచేసే కూలీల కోసం పని ప్రదేశంలో తాగునీరు, నీడ వసతి కల్పించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలనే నిబంధన క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు కావడం లేదు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలో అక్కడక్కడ మాత్రమే ఇవి కనిపిస్తున్నాయి. చాలా చోట్ల లేనేలేవు. పనులు జరిగే చోట కాసేపు సేదతీరడానికి నీడ కరువై.. దప్పిక తీర్చుకోవడానికి నీళ్ల లేక అల్లాడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఈ పరిస్థితి తలెత్తినట్లుగా తెలుస్తుంది. సంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే వడదెబ్బ కారణంగా ఉపాధి పనులు చేస్తున్న ఓ మహిళా కూలీ చనిపోయారు. ఈ క్రమంలో బుధవారం రోజున ఉపాధి పనులు జరిగేచోట 'ఆంధ్రజ్యోతి బృందం' పరిశీలించగా అనేక నిజాలు తేటతెల్లమయ్యాయి.

నీడ లేదు.. నీళ్ల కరువు



చేగుంట మండలంలోని మక్కరాజుపేటలో ఉపాధి పనులు



ఆంధ్రజ్యోతి విజిట్



జహీరాబాద్ మండలం అనెగుంటలో చెట్టుకింద కూలీలు

- మండుటెండల్లో ఉపాధి పనులు
- కూలీలకు సదుపాయాలు కరువు
- వేసవిలో అస్వస్థతకు లోనవుతున్న వైనం
- ఇప్పటికే వడదెబ్బతో మహిళా కూలీ మృతి
- అక్కడక్కడ మాత్రమే సౌకర్యాల కల్పన
- పక్కదారి పడుతున్న ఓఆర్ఎస్ ప్యాకెట్లు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 26 : సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. వేసవికాలం కావడంతో ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు రకరకాల పనులు చేస్తున్నారు. వీరికి ప్రతీరోజు హాజరుతోపాటు కూలీల వివరాలు నమోదు చేసుకొని ఫొటోలు కూడా క్లిక్ చేస్తారు. పనికి తగినట్లుగా కూలి డబ్బులు పలు దఫాలుగా చెల్లిస్తారు. ఇంతవరకు బాగానే ఉంది. ప్రస్తుతం వేసవి సీజన్ ప్రారంభం కావడంతో ఉదయం 8గంటలకే ఎండవేడి తాకుతోంది. గ్రామశివారుల్లో పనులు చేస్తుండడం వల్ల తాగునీటి వసతి అంతంతమాత్రంగానే ఉంటుంది. కొంతమంది ఇంటి వద్ద నుంచే నీళ్ల తీసుకెళ్తుండగా ఇంకొందరు దాహంతో విలవిల్లాడుతున్నారు. కాసేపు సేద తీరడానికి టెంట్లు లేక చెట్ల కింద, పొదల చాటున కూర్చుంటున్నారు.

అధికారుల పర్యవేక్షణేది?

ఉపాధి హామీ పనులు జరుగుతున్న సమయంలో స్థానికంగా ఫీల్డ్ అసిస్టెంట్లు మాత్రమే పర్యవేక్షిస్తున్నారు. జిల్లా, మండల స్థాయి అధికారులు ఎప్పుడో ఒకసారి అటువైపు కన్నెత్తి చూస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు అధికారులు మాత్రం టంచన్‌గా పనులు జరిగే చోటుకు వెళ్తున్నారు. అయితే ఎక్కడైతే పనులు జరుగుతాయో అక్కడ చలువ పందిళ్లు, టెంట్లు వేయాలి. కూలీలకు సరిపడా తాగునీళ్ల అందుబాటులో ఉంచాలి. ఓఆర్ఎస్ ప్యాకెట్లు ప్రతీ కూలీకి అందజేయాలి. ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఉండాలి. కానీ ఇవేవీ కానరావడం లేదు. కనీసం పనులను పరిశీలించేందుకు వెళ్లే అధికారులు సైతం వీటి గురించి ఆరా తీయడం లేదు. కొన్ని చోట్ల ఇవన్నీ ఉంటుండగా.. మిగితా చోట్ల వీటి అడ్రస్ లేదు. ఈ వసతులకు సంబంధించిన నిధులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పక్కదారి పడుతున్నాయా.. ఇంకేవైనా కారణాలున్నాయా అనే విషయం ప్రశ్నార్థకమే.

సంగారెడ్డి జిల్లాలో..

- అందోల్ మండలం పోసానిపేటలో ఉపాధి హామీ కూలీలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. ఇళ్ల నుంచి తెచ్చుకునే నీళ్ల కూడా వేడిగా మారుతున్నాయి.
- జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో కూలీలకు నీడ, నీటి సౌకర్యం లేదు. ఫస్ట్ ఎయిడ్ కిట్ కూడా అంతేసంగతి.
- నాగల్‌గిద్ద మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయి. ఎక్కడా కూడా వసతులు లేవు.
- కోహీర్ మండలంలోని 23 గ్రామాల్లో

మిగతా 8వ పేజీలో



కల్హేర్‌లో ఎండలోనే సేద తీరుతున్న ఉపాధి కూలీలు

అబార్షన్లు చేస్తే కఠిన చర్యలు

- అత్యవసరమైతే తప్ప సిజేరియన్లు వద్దు
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి అర్బన్/సంగారెడ్డి రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎట్టి పరిస్థితుల్లో మైనర్లు, ఇతరులకు అబార్షన్లు చేయవద్దని ఒకవేళ చేస్తే వారికి కఠిన చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బుధవారం పీసీపీఎన్‌డీటీ డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ అడ్వైజరీ కమిటీ, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్టు అమలుపై ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటిసారి గర్భం దాల్చిన మహిళలకు అత్యవసరమైతే తప్ప సిజేరియన్ చేయరాదని సూచించారు. జిల్లాలో 2023-24 సంవత్సరానికి పోల్చితే 2024-25లో మాతా శిశు మరణాలు 50 శాతం తగ్గినట్టు కలెక్టర్ క్రాంతి తెలిపారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా ప్రైవేటు ఆస్పత్రుల్లోని స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయాలని ఇన్‌చార్జి జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. సక్రమంగా లేని ఆస్పత్రులను పోలీసు శాఖ సమన్వయంతో తనిఖీ చేసి సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. జహీరాబాద్ ఏరియా ఆసుపత్రి డాక్టర్ అజ్మనాజ్ గర్భిణులను ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లేలా ప్రేరేపిస్తున్నట్టు విచారణలో తేలడంతో ఆయనను విధులను నుంచి తొలగించాలని జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారిని ఆదేశించారు. దౌల్తాబాద్, మల్చల్మ పీహెచ్‌సీలో నిర్లక్ష్యం వహిస్తున్న ఇదరు వైద్యులకు షోకాజ్ నోటీసులను అందజేయాలని ఆదేశించారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ మాట్లాడుతూ ఇటీవల ఎంఎన్ఆర్ ఆస్పత్రిని రాష్ట్ర పరిశీలన బృందం తనిఖీలో రికార్డులు సరిగా లేవని తేల్చడంతో నోటీసులు జారీ చేసి రూ.50 వేల ఫైన్ వేశామని తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ మాట్లాడుతూ ప్రతీ స్కానింగ్ సెంటర్‌పై డెకాయ్ ఆపరేషన్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సంజీవరావు, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ వనజారెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజు



చిన్నారులతో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

చేగుంట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. నార్సింగ్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్, ఫార్మసిస్ట్ గది, ఓపీ రిజిస్టర్, పలు రికార్డులతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశీలించి రోగులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా మౌలిక సదుపాయాలతో ప్రభుత్వ ఆసుపత్రులలో నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో సీసీ టీవీలు ఏర్పాటు చేసి కంట్రోల్‌రూమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని క్లస్టర్ వారిగా అమలు చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ కరీం, డాక్టర్ రవికుమార్, వైద్య సిబ్బంది ఉన్నారు.



సంగారెడ్డి మండల పరిధిలోని ఓ గ్రామంలో డంప్ చేసిన ఫిల్టర్ ఇసుక

వాగులు తవ్వేస్తున్నారు

- జోరుగా ఇసుక అక్రమ రవాణా
- రాత్రి వేళ గుట్టుగా తరలింపు
- మట్టిని జల్లెడపట్టి కృతిమ ఇసుక
- సంగారెడ్డి మండల పరిధిలో కేసులు పెట్టినా.. డోంట్‌కేర్

7


సర్కారు వారి బకాయిలు 11.53 కోట్లు

- గుదిబండలా మారిన ప్రభుత్వ కార్యాలయాల ఆస్తి పన్ను
- ఏళ్లు గడుస్తున్నా చిల్లి గవ్వ కట్టని వైనం

6

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై నిర్లక్ష్యం

- కీలకమైన అభిప్రాయాల సేకరణలో వెనుకంజ
- నెలాఖరులోగా పూర్తి చేయాలి
- ఎల్ఆర్ఎస్, ఆస్తి పన్ను వసూళ్లలో బిజీగా సిబ్బంది



మెదక్ మున్సిపాలిటీ

మెదక్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థ, స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీలలో పరిశుభ్రతపై చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. మార్చి 1 నుంచి ప్రారంభించిన పౌరుల అభిప్రాయ సేకరణ నెలాఖరుతో ముగియనుంది. అయితే, మున్సిపల్ కమిషనర్లు మొదలుకొని సిబ్బంది అంతా పన్నుల వసూళ్లలోనే బిజిబిజీగా ఉంటున్నారు. మెప్మా ఆర్పీలు గతంలో స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేను చేపట్టేవారు. ప్రస్తుతం వారికి ఇతర పనులు కేటాయించారు. జనాభా ఆధారంగా సుమారు 15 శాతం మంది ప్రజల అభిప్రాయాలను సేకరించాల్సి ఉంది. ఆన్‌లైన్ పోర్టల్‌లో అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. వాటి ఆధారంగా పట్టణాలకు మార్కులు కేటాయిస్తారు. ప్రతిరోజూ మీ ప్రాంతాన్ని మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేస్తారా?, చెత్తా చెదారాల సేకరణకు రోజూ శానిటేషన్ సిబ్బంది వస్తున్నారా?, మీ ప్రాంతంలో చెత్త, వ్యర్థ పదార్థాలు పేరుకుపోతున్నాయా?, స్వచ్ఛ ఆటోల ద్వారా తడి, పొడి చెత్తను వేరు చేస్తున్నారా?, మరుగుదొడ్ల నిర్వహణ ఎలా ఉంది. వీధుల్లో ఊడుస్తున్నారా తదితర ప్రశ్నలకు ప్రజలు ఇచ్చే సమాధానాలు ర్యాంకు సాధించడానికి కీలకం.

మెదక్ పట్టణంలో 5 శాతమే

మెదక్ పట్టణంలో సర్వే నత్తనడకన నడుస్తోంది. 25 రోజులుగా సర్వే కొనసాగుతున్నప్పటికీ ప్రచారం లేకపోవడంతో ప్రజలకు ఇలాంటి ఒక సర్వే కొనసాగుతున్నదనే తెలియదు. వారం రోజులుగా కేంద్రం ఆధ్వర్యంలో ఓ ఏజెన్సీ బృందం ఫీడ్‌బ్యాక్ నిర్వహిస్తోంది. మెదక్ పట్టణ పరిధిలో ఇప్పటివరకు 2,436 మంది పౌరుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. మిగిలిన ఐదు రోజుల వ్యవధిలో ఎక్కువ మంది అభిప్రాయాలు సేకరిస్తే మెరుగైన ర్యాంకును సాధించే అవకాశం ఉంది.

ఈ మున్సిపాలిటీల్లో పూర్

రామాయంపేట మున్సిపాలిటీలో 25 రోజులుగా కేవలం 27 మంది అభిప్రాయాలనే సేకరించారు. ప్రజలు సర్వేలో నెగిటివ్ సమాధానాలు వ్యక్తం చేస్తున్నారా? లేదా అసలు పౌరుల వద్దకే వెళ్లడం లేదా తెలియడం లేదు. నర్సాపూర్ పరిధిలో స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే రామాయంపేట కంటే ఒకింత మెరుగ్గా ఉంది. ఇప్పటివరకు 550 మంది పౌరుల అభిప్రాయాలను సేకరించారు. నగరానికి సమీపంగా ఉన్న తూప్రాన్ మున్సిపాలిటీ ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కాస్త మెరుగ్గానే ఉంటుంది. అధికారులు, సిబ్బంది వైఫల్యమా ఏమో కానీ 401 మంది అభిప్రాయాలు మాత్రమే సేకరించినట్లు అధికారులు తమ పోర్టల్‌లో పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని పౌరుల వద్దకు వెళ్లి వీలైనన్ని అభిప్రాయాలను సేకరిస్తే కాస్త మెరుగైన ర్యాంకు వచ్చే అవకాశం ఉంది.

తూకం వేసి సన్న బియ్యం సరఫరా చేయాలి

● డీఎస్‌వో, డీఎంలకు రేషన్ డీలర్ల సంఘం వినతి

మెదక్ అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గోదాముల నుంచి తూకం వేసిన సన్న బియ్యాన్ని రేషన్ దుకాణాలకు సరఫరా చేయాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ బుధవారం కలెక్టరేట్‌లోని డీఎ్‌సవో, డీఎంలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలాకాలం నుంచి గోదాముల ద్వారా రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తున్న ప్రతీ సంచిలో ఒకటి రెండు కిలోల బియ్యం తక్కువగా వస్తుందన్నారు. అంతేకాకుండా తూకం లేకుండా ఒకే లారీలో మూడు షాపులకు బియ్యం లోడ్‌ను పంపుతున్నారని, తూకంలో తేడాలు ఉంటుయన్నారు. ప్రభుత్వం వినియోగదారులకు సన్న బియ్యం అందించేందుకు ఏర్పాట్లు చేస్తుందని, గోదాంలో ఉన్న వే బ్రిడ్జిలతో డీలర్ ఎదుట తూకం వేసి షాపులకు సరఫరా చేయాలన్నారు. ఈ మేరకు గోదాములు ఇన్‌చార్జిలకు ఆదేశాలు జారీచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల డీలర్లు పాల్గొన్నారు.

మసీదుల వద్ద లైట్లు ఏర్పాటు చేయండి

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని ఈనెల 26న జరిగే జగ్నేకిరాత్ కోసం మున్సిపల్ ద్వారా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ మెంచు నగేష్‌గౌడ్‌ను పట్టణ జామా మసీద్ కమిటీ సభ్యులు కోరారు. ఈ విషయమై బుధవారం కలెక్టరేట్‌లో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. జగ్నేకిరాత్ సందర్భంగా పట్టణంలోని మసీదుల వద్ద ఎల్‌ఈడీ లైట్లు, పారిశుధ్య పనులు చేయించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో జామా మసీద్ కమిటీ అధ్యక్షుడు అఫ్జల్, కార్యదర్శి ముజీబ్, ఇమాం సయ్యద్, ఖాజామొయినొద్దీన్, సభ్యులు నసీర్‌ఖాన్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు వారి బకాయిలు 11.53 కోట్లు

● గుదిబండలా మారిన ప్రభుత్వ ఆస్తి పన్ను ● ఏళ్లు గడుస్తున్నా చిల్లి గవ్వ కట్టని వైనం



పట్టణంలోని బీఎస్ఎన్ఎల్, తపాలా కార్యాలయం

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని నాలుగు మున్సిపాలిటీల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు ఆస్తి పన్ను చెల్లించడం లేదు. ఎన్ని నోటీసులు జారీ చేసినా స్పందించేవారు లేకపోవడంతో మున్సిపాలిటీ అధికారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపునకు వస్తున్న సమయంలోనూ పన్నులు చెల్లించకపోవడంతో ఏం చేయాలో.. ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి. మెదక్ జిల్లా కేంద్రంలో ఆరు కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, 110 రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి సంవత్సరం రూ. 76 లక్షల ఆస్తి పన్ను వసూలు కావాల్సి ఉండగా, అవి పేరుకపోవడంతో బకాయిలు రూ. 10.52 కోట్లకు చేరాయి. కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ భవానిలు జిల్లా ప్రధాన న్యాయాధికారి బి. లక్ష్మీశారదను కలిసి కోర్టు భవనాల పన్నుల విషయాన్ని రచ్చించారు. స్పందించిన న్యాయమూర్తి 21 సంవత్సరాల కోటి 72 లక్షలు చెల్లించారు.

- నర్సాపూర్ పరిధిలో 42 రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలుండగా ఏటా రూ. 60 లక్షలు పన్నుల రూపేణ రావాల్సి ఉంది. పన్నులు చెల్లించకపోవడంతో ప్రస్తుతానికి బకాయిలతో కలిపి మొత్తం రూ. 90 లక్షలు రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

- రామాయంపేటలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయం ఒకటి, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు 20 ఉండగా ఇందులో 7 భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి సంవత్సరం రూ. 4.43లక్షలు పన్నుల రూపేణ రావాల్సి ఉంది. ఇక్కడ రూ. 55 వేల పన్ను వసూలైంది. ఇంకా రూ. 6.97 లక్షల బకాయి ఉంది. తూప్రాన్‌లో 20 రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు ఉండగా ఏటా రూ. 38వేలు పన్నుల రూపేణ రావాల్సి ఉంది. ప్రస్తుతం బకాయిలు రూ. 4.38 లక్షలకు చేరాయి.

లారీ, డీసీఎం ఢీ, డ్రైవర్‌కు తీవ్రగాయాలు

చేగుంట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : డీసీఎంను లారీ వెనక నుంచి ఢీకొనడంతో లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన చేగుంట 24వ జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. కామారెడ్డి నుంచి చేగుంట0 వైపు పైపుల లోడుతో వెళ్తున్న డీసీఎం డ్రైవర్ మక్కరాజుపేట బ్రిడ్జి వద్ద రోడ్డు మలుపుతుండగా కామారెడ్డి నుంచి వేగంగా వస్తున్న లారీ డీసీఎంను వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో బీహార్ రాష్ట్రానికి చెందిన పవన్‌కుమార్ అనే డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. స్థానికులు, పోలీసులు క్రేన్ సహాయంతో బయటకు తీసి, 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

తాత్కాలిక కారోబార్ ఆత్మహత్య


బోయిని కుమార్(ఫైల్)

అల్లాదుర్గం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ తాత్కాలిక ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా అల్లాదుర్గంలో బుధవారం జరిగింది. ఎస్సై ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం.. అల్లాదుర్గానికి చెందిన బోయిన కుమార్ (28) తాత్కాలిక కారోబార్‌గా పని చేస్తున్నాడు. సకాలంలో వేతనాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో ఈ నెల 21న అర్ధరాత్రి తన ఇంట్లోనే క్రిమిసంహారక మందు తాగాడు. అపస్మారక స్థితికి చేరుకున్న అతనిని వెంటనే జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి సంగారెడ్డికి.. తర్వాత హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా, అక్కడ బుధవారం మృతి చెందాడు. కుమార్ అవివాహితుడు. సోదరుడు బోయిని పోచయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి మందలించాడని తనయుడు..


సుంకరి ప్రశాంత్(ఫైల్)

కోహెడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : తండ్రి మందలించాడని మనస్తాపంతో తనయుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కోహెడ మండలం రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన సుంకరి నాగయ్య గొర్రెలకాపరిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన కుమారుడు ప్రశాంత్(19) ఇంటర్మీడియట్ వరకు చదివి మానేశాడు. కొద్దిరోజులుగా ఏం పనిచేయకుండా ఖాళీగా ఉంటున్నాడు. ఏ పనిచేయడం లేదని తండ్రి మందలించడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన ప్రశాంత్ 21న క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లాడు. గమనించిన కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు.

చేపల వేటకు వెళ్లి యువకుడి గల్లంతు


అజయ్‌కుమార్ (ఫైల్)

మనోహరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లి యువకుడు గల్లంతైన ఘటన మండల పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలం రంగాయపల్లి గ్రామానికి చెందిన మన్నే అజయ్ కుమార్ (26) చెరువులో చేపల వేటకు వెళ్లి గల్లంతైనాడు. గ్రామానకి చెందిన చింత కుంట చేరువులో చేపల వేటకు వెళ్లి మధ్యాహ్నం సమయంలో చెరువులో గల్లంతైనట్లు గ్రామస్థులు తెలిపారు. విషయం తెలిసిన పోలీసులు ఘటన స్థలం చేరుకోని ఈత గాల్లతో గాలింపు చర్యలు చేపట్టారు. ఇంత వరకు అయజ్ కుమార్ చెరువులో వెతికిన ఏలాంటి ఆచూకి లభించలేదు.

కొనసాగుతున్న పదో తరగతి పరీక్షలు

● కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ నగేష్

● బందోబస్తును పర్యవేక్షించిన ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి


గీతా స్కూల్ పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తు పర్యవేక్షిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 68 కేంద్రాల్లో నాలుగోరోజు బుధవారం నిర్వహించిన గణిత పరీక్షకు మొత్తం 10,420 మంది విద్యార్థులకు గానూ 10,393 మంది హాజరుకాగా.. 27 మంది గైర్హాజరైనట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు. అదనపు కలెక్టర్ నగేష్ నర్సాపూర్, కౌడిపల్లి, మాసాయిపేట పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు. సెంటర్ల వద్ద బందోబస్తును ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షించారు.

పదో తరగతి గణితం పరీక్ష ప్రశాంతం

సంగారెడ్డి అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో పదో తరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం గణితం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 122 పరీక్షా కేంద్రాల్లో 22,414 మంది విద్యార్థులకుగాను 22,373 మంది హాజరుకాగా 41 మంది గైర్హాజరయ్యారు. 99.82 హాజరు శాతం నమోదైంది. కాగా జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలను డీఈవో వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు.

వైభవంగా దుర్గామాత ఆలయ వార్షికోత్సవం


మంగల్‌పేట దుర్గామాత ఆలయంలో నిర్వహించిన హోమంలో భక్తులు

నారాయణఖేడ్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలోని దుర్గాభవానీమాత ఆలయ 18వ వార్షికోత్సవం బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు, మలమంచి మోహన్ జ్యోషి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని అలంకరించి చండీవాహన, లలితా సహస్రనామ పారాయణం, మూలమంత్ర హవనంనిఇర్వహించారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఉదయ్‌కుమార్ సాగర్ దంపతులు, బీజేపీ నాయకులు జైపాల్‌రెడ్డి, జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగజోగినాథ్ పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి ఆలయంలో..

వెల్దుర్తి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బస్వాపూర్ భ్రమరాంబ మల్లికార్జునస్వామి 48వ ఆలయ వార్షికోత్సవ వేడుకలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో గణపతిపూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠ, అఖండ దీపస్థాపన, మంటపారాధన, మూలమంత్ర హోమలు, పూర్ణహుతి వంటి పూజలు నిర్వహించారు. ఉదయం కుకునూర్‌లోని హన్‌మాన్ ఆలయం నుంచి మల్లికార్జునస్వామి ఆలయం వరకు జెండా ఊరేగింపు నిర్వహించారు.

వార్షికోత్సవానికి దుర్గమ్మతల్లి ఆలయం ముస్తాబు

పెద్దశంకరంపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పెద్దశంకరంపేటలోని దుర్గమ్మతల్లి ఆలయం ప్రథమ వార్షికోత్సవానికి ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. 28న ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, సాయంత్రం సరస్వతీ శిశుమందిర్(దేవిడి) నుంచి దుర్గమ్మతల్లి ఆలయం వరకు బోనాల ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు.

బహిరన్‌దిబ్బలో బోనాలు

అల్లాదుర్గం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గం మండలం బహిరన్‌దిబ్బ గ్రామంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయ 26వ వార్షికోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బోనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు, నాయకులు చెన్నప్ప, కోర్మని ప్రభు, వీరప్ప, శరణ్ పాటిల్, యాదయ్య పాల్గొన్నారు.

ఘనంగా లలిత సహస్ర కుంకుమార్చన

కల్హేర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కంగ్టి మండలం మార్డి గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద లలిత సహస్ర కుంకుమార్చన శ్రీవిద్య ఉపాసకులు సంజీవులుమహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

తెరసం ఆధ్వర్యంలో నేడు ఉగాది కవి సమ్మేళనం

మెదక్ కల్చరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉగాది కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షురాలు ముత్తిగారి కవిత తెలిపారు. మెదక్ టీఎన్జీవో భవన్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెరసం వ్యవస్థాపక అధ్యక్షుడు నందిని సిద్ధారెడ్డి, తెరసం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, ప్రధాన కార్యదర్శి వి.శంకర్, ఉపాధ్యక్షుడు గణపురం దేవేందర్ పాల్గొననున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకుంటున్న కవులు 94940 42367, 94948 25665 నంబర్‌కి తమ కవితను పంపి పేరు నమోదు చేసుకోవాలని అన్నారు. దీంతో పాటు ఎంపికైన కవులకు ఉగాది పురస్కారం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే కవులు మన సంస్కృతిని ప్రతిబింబించే సంప్రదాయ దుస్తులు వేసుకుని రావాలని అన్నారు. కవితలు ఉగాది అంశంగా రాయాలని కవితలు పంపేవారు 20 లైన్లకు తగ్గకుండా 40 లైన్లకు మించకుండా ఉండేలాగా చూసుకోగలరన్నారు. ఈ కార్యక్రమంలో తెరాసం సభ్యులు వెంకటేశం, బుర్ర సంతోష్, ముద్దాపురం నవీన్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో గీతం అధ్యాపకుడి పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న అతిథులు

పటాన్‌చెరు రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జె.డి.ప్రభాకర్ పరిశోధనా పుస్తకం 'భారతీయ భాషల సామాజిక-ఆర్థిక ఆకృతి' పుస్తకాన్ని హైదరాబాద్ ఉస్మానియా వర్సిటీలో ఆవిష్కరించినట్లు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిష్టాత్మక 13వ అంతర్జాతీయ తెలుగు భాషాశాస్త్ర సదస్సులో, పలువురు ప్రముఖులు ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. జర్మనీలోని ప్రఖ్యాత ప్రచురణల సంస్థ లింకం జీఎంబీహెచ్ యూరోపా ప్రచురించిన ఈ పుస్తకం అంతర్జాతీయ గుర్తింపు పొందింది. జర్మనీలోని పలు జాతీయ గ్రంథాలయాలలో దీని ప్రతులు ఉన్నాయని తెలిపారు. ఆర్థిక కార్యకలాపాలు, సంపద ఉత్పత్తిని మెరుగుపరచడానికి స్థానిక భాషలను పారిశ్రామిక రంగాలలో అనుసంధానించాల్సిన అవసరం ఉందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మాలిక్యులర్ డాకింగ్‌పై శిక్షణ

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో 'మాలిక్యులర్ డాకింగ్ అండ్ వర్చువల్ స్క్రీనింగ్'పై వచ్చే నెల 11న వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొనేవారికి కంప్యూటేషనల్ డ్రగ్ డిస్కవరీలో లోతైన అవగాహనను కల్పించడంతోపాటు ఆచరణాత్మక అనుభవాన్ని అందించడానికి రూపొందించినట్లు ఆయన తెలియజేశారు. మాలిక్యులర్ డాకింగ్ అండ్ వర్చువల్ స్క్రీనింగ్ పరిచయం, డాకింగ్ మోడల్స్ యొక్క ఆప్టిమైజేషన్ అండ్ వాలిడేషన్, డ్రగ్ డిస్కవరీలో రియల్ - వరల్డ్ కేస్ స్టడీస్ వంటి ముఖ్య అంశాలపై తర్ఫీదు ఇస్తామన్నారు. పూణేలోని అడ్వెంట్ ఇన్ఫర్మేటిక్స్‌లో అప్లికేషన్ సైంటిస్ట్ ఆదిత్య మిశ్రా ఈ కార్యశాలలో ప్రధాన శిక్షకుడిగా పాల్గొంటారని తెలిపారు. దీనిలో కేవలం 30 మంది మాత్రమే పాల్గొనే వీలుంటుందని ప్రిన్సిపాల్ స్పష్టీకరించారు. ఆసక్తి గలవారు ఏప్రిల్ 7వ తేదీ లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, రుసుము తదితర వివరాల కోసం 82394 77935 ను సంప్రదించాలని సూచించారు.

వ్యాధి నిరోధక టీకాలను సక్రమంగా అందించాలి



గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రిలో జేడీ సుధీర

గజ్వేల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా అందేలా చూడాలని చైల్డ్ హెల్త్ అండ్ ఇమినైజేషన్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సుధీర వైద్య అధికారులకు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పాల్వన్‌కుమార్‌తో కలిసి ములుగు, గజ్వేల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు జిల్లా ఆసుపత్రిలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల నిర్వహణ, బిడ్డల ఆరోగ్య కార్యక్రమాల సేవలను పరిశీలించారు. జిల్లాలోని ములుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యక్రమాలు వ్యాధినిరోధక టీకాల పనితీరు రికార్డును, బిడ్డల సంక్షేమ కార్యక్రమాల ద్వారా పిల్లలకు అందుతున్న సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను స్వయంగా పరిశీలించారు. గజ్వేల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించారు. ఆమెతో రాష్ట్ర బృందం డిప్యూటీ డీఎంహెచ్ డాక్టర్ రేవతి, డాక్టర్ శ్రీనివాస్, శ్రీకల, వ్యాధి నిరోధక టీకాల నియంత్రణ అధికారి వైద్య అధికారులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వాల కృషి

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

సిద్దిపేట కల్చరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సామాజిక సమస్యలను ఎదుర్కొంటున్న అట్టడుగు వర్గాల సమస్యలను చర్చించడానికి ఈ సదస్సు ఉపయోగపడుతుందని, అర్థవంతమైన సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లడానికి ప్రయత్నిస్తానని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. బుధ వారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ, అట్టడుగు వర్గాలకు విద్య ద్వారానే సామాజిక సమానత్వం సాధ్యమవుతుందన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెంచేలా ఉన్నత విద్యలో మార్పులు రాబోతున్నాయని తెలిపారు. కాకతీయ విశ్వవిద్యాలయం రిటైర్ ప్రొఫెసర్ తోట జ్యోతి రాణి మాట్లాడుతూ, సామాజిక అంతరాలు పెరుగుతున్నాయని వాటిని అధిగమించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దరువు ఎల్లన్న ఉద్యమ పాటలతో విద్యార్థులు అలరించారు. ఈ సదస్సులో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారదర్శకత కోసమే సామాజిక తనిఖీ



జోగిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పారదర్శకంగా, నిబంధనల ప్రకారం అమలు చేసేందుకే యేటా సామాజిక తనిఖీ నిర్వహించి, ప్రజాదర్బార్‌లో సమీక్షిస్తున్నట్టు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్డీవో) జ్యోతి అన్నారు. బుధవారం జోగిపేటలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ఆమె హాజరయ్యారు. అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బాల్‌రాజ్ అధ్యక్షతన 24 గ్రామపంచాయతీల్లో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులపై విచారణ జరిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఈఆర్డీవో బాల్‌రాజ్, జిల్లా సామాజిక తనిఖీ ఎస్‌టీఎం దత్తు, స్టేట్ రిసోర్స్ సహాయ విజిలెన్స్ అధికారి నాగేశ్వర్‌రావు, ప్లాంటేషన్ మేనేజర్ మణికుమార్, రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్రీలత పాల్గొన్నారు.

వాగులు తవ్వేస్తున్నారు

జోరుగా ఇసుక అక్రమ రవాణా

రాత్రి వేళ గుట్టుగా తరలింపు
మట్టిని జల్లెడపట్టి కృత్రిమ ఇసుక





నిజాంపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఇసుక.. కొందరికి కాసుల వర్షం కురిపిస్తోంది. పోలీసులు, అధికారులు ఎన్ని చర్యలు చేపట్టినా అక్రమార్కులు వాగులను తవ్వేస్తూ గుట్టుగా అమ్మకాలు సాగిస్తున్నారు. పెద్ద పెద్ద యంత్రాలు వినియోగించి ఇసుకను తోడేస్తున్నారు. మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధి కల్వకుంట శివారు మూలవాగు నుంచి కొన్నాళ్లుగా యథేశ్చగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది కళ్లు గప్పి రాత్రి వేళ ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారు. వాగులో ఎక్స్‌కవేటర్ల సహాయంతో ఇసుకను తోడేస్తూ తమకు అనుకూలమైన చోట డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మూల వాగు నుంచి జోరుగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న విషయం అధికారులకు తెలిసినా.. తూతూ మంత్రంగా దాడులు చేసి వదిలిపెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడ్డగోలుగా తవ్వి ఇసుక తీస్తుండటంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అక్రమంగా ఇసుక తవ్వితే కేసులు



ఇసుక అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తాం. మూలవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న సమాచారం మాకు అందలేదు. సిబ్బందిని పంపించి విచారణ జరిపిస్తాం. మూలవాగులో ఇసుక తవ్వితే ఊరుకోం.

రమశ్రీ, ఇన్‌చార్జి తహసీల్దార్



సంగారెడ్డి మండలం హనుమాన్‌నగర్‌లో మట్టిని జల్లెడ పట్టి ఇసుకను తీస్తున్న దృశ్యం

కేసులు పెట్టినా.. డోంట్‌కేర్

సంగారెడ్డి రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఖాజానాకు గండి కొడుతున్న అక్రమార్కులకు చెక్ పెట్టేందుకు పోలీసులు ఇటీవల సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట, బ్యాతోల్, దాసుగడ్డ, హనుమాన్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇసుక ఫిల్టర్లపై దాడులు చేసి రిచ్‌లను ధ్వంసం చేశారు. వరుసగా పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు కూడా పంపించారు. అయినా, అక్రమార్జనకు అలవాటు పడిన వారు ఏ మాత్రం భయపడటం లేదు. తిరిగి దర్జాగా తమ అక్రమ దందాను కొనసాగిస్తున్నారు. సంగారెడ్డి మండలం హనుమాన్‌నగర్ తండాలో కొందరు పట్టపగలు మట్టిని నీటితో జల్లడ పట్టి కృత్రిమ ఇసుకను తయారు చేస్తూ మేడ్చల్ జిల్లా బాచుపల్లి, సూరారం, అన్నారం, హత్నూర మండలం మల్కాపూర్, దౌల్తాబాద్ తదితర ప్రాంతాలకు ట్రాక్టర్‌లలో తరలిస్తున్నారు. దూరాన్ని బట్టి ట్రాక్టర్‌కు రూ. 4000 వేల నుంచి రూ. 5000 వేల వరకు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. మూడు రోజుల క్రితమే పోలీసులు మొత్తం ధ్వంసం చేసి మళ్లీ చేయవద్దని హెచ్చరించినా ఇసుక తయారీ మాత్రం ఆగడం లేదు. అక్రమ వ్యాపారం చేస్తున్న వారికి స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలు ఉండడంతోనే పట్టపగలు కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు కలిసి మట్టిని ఫిల్టర్ చేసి ఇసుకను తయారు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం..

మట్టిని ఫిల్టర్ చేసి కృత్రిమ ఇసుక తయారు చేసే వారిని ఇదివరకే హెచ్చరించి వదిలేశాం. సిబ్బందిని పంపించి పర్యవేక్షించి తిరిగి కృత్రిమ ఇసుక తయారు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరిపైనా ఉపేక్షించేది లేదు. వారెంతటివారైనా చర్యలు తప్పవు.

-దేవదాస్, తహసీల్దార్, సంగారెడ్డి

దిష్టి కాదు దృష్టి పడుతోంది





తుక్కాపూర్ గ్రామంలో ఓ రైతు తన మిరపచేనుకు దిష్టి తగలకుండా సినీతారల ఫ్లెక్సీలు పెట్టించాడు. ఆ మార్గంలో పోయే వాహనదారులు వాటివైపు వింతగా చూస్తున్నారు. పంటకు దిష్టి తగలడమేమోగాని ఫ్లెక్సీలు మీద అందరి దృష్టి మాత్రం పడుతోంది. మండలంలోని తుక్కాపూర్ గ్రామానికి చెందిన రైతు చిక్కుడు ఉప్పలయ్య తాను సాగు చేసిన మిర్చి తోటలో ఈ ఏర్పాటు చేశారు.

- తొగుట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి)



తాగునీటి సరఫరా ఫొటోలు తీస్తున్న సభ్యులు

పట్టణంలో కేంద్ర బృందం పర్యటన

జహీరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో స్వచ్ఛభారత్ పనులను కేంద్ర ఏజెన్సీ బృందం అధికారులు పరిశీలిస్తున్నారు. వారం రోజులుగా పట్టణంలో రోడ్లు, మురుగు కాలువలు, చెత్త సేకరణ తీరు, పబ్లిక్ టాయ్‌లెట్స్, చెత్త ప్రాసెసింగ్ యూనిట్, కంపోస్టు ఎరువు తయారీ, డంపింగ్‌యార్డులను పరిశీలిస్తున్నారు. సందేహాలున్నచోట శానిటేషన్, మున్సిపల్ సిబ్బందిని అడిగి అనుమానాలను నివృత్తి చేసుకుంటున్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా అందుతున్న సేవల గురించి వార్డుల్లో పర్యటించి ప్రజలను అడిగి తెలుసుకుంటున్నారు.



కోలాహలంగా వీరభద్ర స్వామి విమానోత్సవం

గుమ్మడిదల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బొంతపల్లి వీరన్న వీరభద్ర స్వామి విమాన రథోత్సవ భక్తుల కోలాహలం మధ్య వైభవంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున ఆలయ చైర్మన్ మద్ది ప్రతాప్‌రెడ్డి, ఈవో శశిధర్ గుప్తాల ఆధ్వర్యంలో వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఉంచి ఆలయ ప్రాంగణం నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకు రథోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు రథాన్ని లాగుతూ మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం రాత్రి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆకట్టుకునే విధంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఎల్ఆర్ఎస్‌కు 31 వరకే గడువు..

మెదక్ అర్బన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం 25 శాతం రాయితీ కల్పించిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. బుధవారం ఆయన ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రుసుం చెల్లించిన వారి ప్లాట్‌ను పర్యవేక్షించి, రాయితీని మినహాయిస్తూ..భూమి క్రమబద్ధీకరణ ప్రొసీడింగ్స్ జారీ చేస్తామన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు చివరి గడువు ఉందని, వినియోగదారులు లబ్ధిపొందాలని సూచించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ నగేష్ డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తూ.. ఆర్థిక సహాయం అందించడానికి ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. బుధవారం యువ వికాసం హెల్ప్ డెస్క్ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, పలు సూచనలు చేశారు.

భద్రతకు కట్టుబడి ఉన్నాం..

సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్- పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశం



మాట్లాడుతున్న ఎస్పీ

పటాన్‌చెరు రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల భద్రత, అక్కడ పనిచేసే ఉద్యోగుల, మహిళా ఉద్యోగుల భద్రతకు కట్టుబడి ఉన్నామని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. పాశమైలారం ఇండస్ట్రియల్ ఏరియా అథారిటీ, ఎస్ఎస్ఎస్సీ (సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్) ఆధ్వర్యంలో బుధవారం పాశమైలారం ఐలా కార్యాలయంలో పరిశ్రమల భద్రత, ట్రాఫిక్ సమస్యలపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పరిశ్రమల్లో పని చేసే మహిళా ఉద్యోగుల భద్రత కోసం షీ షటిల్ బస్సులు నడుపుతున్నామని, త్వరలో మరిన్ని కొత్త బస్సులు నడుపుతామన్నారు. పరిశ్రమల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి కంపెనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, సరైన గుర్తింపు కార్డులు ఉన్నవారినే ఉద్యోగాల్లోకి తీసుకోవాలని సూచించారు. రోజూ ఉదయం, సాయంత్రం పరిశ్రమలకు చెందిన వాహనాల డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని, భారీ వాహనాలు రాత్రి సమయంలోనే అనుమతించాలని ఈ సందర్భంగా ఎస్పీ సూచించారు. ఎస్ఎస్ఎస్సీ బలోపేతానికి అన్ని పరిశ్రమలు ముందు రావాలన్నారు. పరిశ్రమలకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. పారిశ్రామిక వాడలలో ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి త్వరలో ట్రాఫిక్ మార్షల్స్‌ను నియమిస్తామన్నారు. పరిశ్రమల భద్రత విషయంలో ఏ మాత్రం రాజీపడేది లేదని, అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏ.సంజీవరావ్, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఎస్సీ ఎస్సీ జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ, కోశాధికారి ఎం. రమణారెడ్డి, ఐలా వైస్ చైర్మెన్ కె. రాఘవరెడ్డి, కోశాధికారి జి.వి.పి. రాజు, వివిధ ఫార్మా, ఇంజనీరింగ్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు, పటాన్‌చెరు, బీడీఎల్ ఇన్‌స్పెక్టర్లు వినాయక్ రెడ్డి, లాలునాయక్, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

సర్కారు స్కూల్‌కు కార్పొరేట్ హంగులు

బడి బాగుపడింది..

- బాలబాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు
- డిజిటల్ తరగతుల కోసం 20 కంప్యూటర్లు
- పాఠశాల ఆవరణలో కళావేదిక..



పాఠశాలలో కళావేదిక

మర్కుక్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఓ ఎన్నారై చొరవతో ప్రభుత్వ పాఠశాల కార్పొరేట్ సొబగులు అద్దుకుంది. అంతటితో ఆగకుండా జాతీయ స్థాయి ఉత్తమ స్వచ్ఛ పాఠశాలగా ఎంపికైంది. కనీస సౌకర్యాలు లేక కునరిల్లిన ఆ పాఠశాలను బాగు చేయాలనే లక్ష్యంతో అక్కడ పని చేసే ఓ ఉపాధ్యాయుడు తన స్నేహితుడైన ఎన్నారైతో కలిసి బడిని బాగు చేశారు.

మర్కుక్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొన్నేళ్ల క్రితం విద్యార్థులు కూర్చునేందుకు తరగతి గదులు కూడా లేదు. తాగునీటి సదుపాయం సంగతి సరే సరి.. ఈ నేపథ్యంలో పాఠశాలకు భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా అమర్నాథ్ బదిలీపై వచ్చారు. పాఠశాల పరిస్థితి చూసి.. ఇక్కడి విద్యార్థుల కోసం ఎదైనా చేయాలనే ఉద్దేశంతో తన వంతుగా సాయం అందించడం ప్రారంభించారు. కానీ, తన ఒక్కడి వల్ల బడిని.. అందులో చదువుతున్న విద్యార్థుల పరిస్థితిని మార్చలేనని భావించారు.



పాఠశాలలోని గ్రంథాలయం, పాఠశాలలోని మరుగుదొడ్లు



లయన్ సూర్యరాజు

కార్పొరేట్ హంగులు..

భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు అమర్నాథ్ పాఠశాల పరిస్థితిని తన స్నేహితుడు, హైదరాబాద్ లయన్స్ క్లబ్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న సూర్యరాజు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన వెంటనే పాఠశాలను సందర్శించి, పాఠశాల రూపురేఖలు మార్చారు. బాలబాలికల కోసం 68 బ్లాక్‌లతో ప్రత్యేక మరుగుదొడ్లను నిర్మించారు. వాటి నిర్వహణ కోసం ఏటా రూ. 80 వేలు అందిస్తూ ప్రత్యేక స్కావెంజర్‌ను నియమించారు. అలాగే, విద్యార్థులు ఏటా మూడు వేల నోటు పుస్తకాలు, రెండు జతల స్పోర్ట్స్ యూనిఫాం, స్కూల్ బ్యాగ్‌లు అందిస్తున్నారు. తరగతి గదుల్లో విద్యార్థులు కూర్చొనేందుకు 200 డెస్క్‌లను అందజేశారు.

డిజిటల్ తరగతి గదులు

ఇంగ్లిష్ టీచర్లు రమణారావు, శ్రీనివాసరావుల విజ్ఞప్తి మేరకు లయన్ సూర్యరాజు పాఠశాలలో 20 కంప్యూటర్లు అమర్చి.. విద్యార్థులకు డిజిటల్ తరగతులను దరి చేర్చారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చేందుకు ఏటా పాఠశాల వార్షికోత్సవం నిర్వహిస్తుండగా, అందుకు అయ్యే ఖర్చును భరిస్తున్నారు. ఇక తన సతీమణి నిర్మల పేరిట పాఠశాల ఆవరణలో కళావేదిక నిర్మించారు. పదో తరగతి పరీక్షల్లో మంచి జీపీఏ సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు. లయన్ సూర్యరాజు సహకారంతో మర్కుక్ జెడ్పీ హైస్కూల్ ఇప్పుడు సర్వహంగులతో కార్పొరేట్ పాఠశాలను తలపిస్తోంది. దీంతో జాతీయ స్థాయిలో స్వచ్ఛ పాఠశాలగా గుర్తింపు సాధించింది.

స్కూల్‌లో సోలార్ ప్లాంట్

లయన్ సూర్యరాజు పాఠశాలకు ప్రత్యేక సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయించారు. తాగునీటి ఇబ్బందులు తప్పించేందుకు పెద్ద వాటర్ ట్యాంక్, మినరల్ వాటర్ కోసం ప్యూరిఫైయర్ ఏర్పాటు చేయించారు. బాలికల ప్రత్యేక అవసరాల కోసం కిట్స్ అందిస్తున్నారు. విద్యార్థులంతా సమానమే అనే భావన కల్పించేందుకు మధ్యాహ్నభోజనం చేసేందుకు వీలుగా సుమారు 400 ఒకే రకమైన పేట్లను అందజేశారు. పాఠశాలకు వంట పాత్రలను కూడా ఏర్పాటు చేశారు.

న్యూస్ బాక్స్

పోషకాహారం పంపిణీ

కంది, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ అధికారుల సహకారంతో కంది మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు బుధవారం డీఈవో వెంకటేశ్వర్లు పోషకాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జోగప్ప, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ అధికారులు, ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, దాత బుగ్గన్నగారి కాశీనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లు విజయవంతం

మునిపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ సాధురాం కంటి ఆసుపత్రి సహకారంతో ఈ నెల 24న మండల పరిధిలోని తాటిపల్లి గ్రామ శివారులో గల యునైటెడ్ స్కూల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే కంటి సమస్యతో బాధపడుతున్న 15 మందికి నిర్వహించిన కంటి ఆపరేషన్లు విజయవంతమయ్యాయి.

సన్నబియ్యం సరఫరా

మనూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వచ్చేనెల నుంచి మండలంలోని వివిధ గ్రామాల్లో చౌకధరల దుకాణాల్లో సన్నబియ్యం సరఫరా చేయాలని తహసీల్దార్ వెంకటస్వామి అన్నారు. బుధవారం మనూరులో రేషన్‌డీలర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అనంతరం మైనార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 27న నారాయణఖేడ్‌లోని సాయిబాబా ఫంక్షన్‌హాల్‌లో ఇఫ్తార్‌విందు నిర్వహిస్తున్నామని, మైనార్టీ నాయకులు హాజరుకావాలన్నారు.

డీడీఎన్‌ఏఎస్ మండల కన్వీనర్‌గా శ్రీకాంత్‌స్వామి

కంగ్టి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : దూప దీప నైవేద్య అర్చక సంఘం మండల కన్వీనర్‌గా మఠపతి శ్రీకాంత్‌స్వామి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ బుధవారం తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన అర్చక సంఘం బాధ్యులందరికీ శ్రీకాంత్‌స్వామి కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

నర్సాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్‌లోని సునీతాలక్ష్మారెడ్డి కాలనీలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీవో హేమభార్గవి బుధవారం తనిఖీ చేశారు. కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, ప్రీ స్కూల్ కార్యక్రమాలను, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యలక్ష్మి భోజనం తీరును పరిశీలించారు.

మాజీ సర్పంచ్ మృతి

జహీరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం పైనుంచి పడిన మొగుడంపల్లి మండలంలోని రాయిపల్లితండాకు చెందిన మాజీ సర్పంచ్ కీరుచౌహాన్(54) బుధవారం మృతిచెందాడు. వారంరోజుల క్రితం ద్విచక్ర వాహనం పైనుంచి పడడంతో కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

చేగుంట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : చేగుంట మండలం మక్కరాజుపేట పాఠశాలలో సీఆర్పీగా పనిచేసిన ఎర్ర శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి నర్సాపూర్ ఎంఈవో తారాసింగ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సేకరించిన రూ.1 లక్షల డీడీని డీఈవో రాధాకిషన్ చేతులమీదుగా శ్రీనివాస్ కుటుంబసభ్యులకు అందజేశారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

మనూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మనూరులోని ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య ఏర్పడింది. ఈ విషయాన్ని కాలనీవాసులు జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించి వెంటనే కాలనీలో బోరు వేసి తాగునీటి సరఫరా చేయాలని అధికారులకు ఆదేశించారు. బుధవారం కాలనీలో బోరు వేయడంతో పుష్కలంగా పడడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.

రామాలయ ఉత్సవాలు

తూప్రాన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణ శివారులోని పురాతన శ్రీరామాలయ వార్షిక ఉత్సవాలు ఏప్రిల్ 4 నుంచి 13 వరకు నిర్వహించేందుకు నిర్ణయించారు. బుధవారం రామాలయం వద్ద పుర ప్రముఖులు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. వార్షిక ఉత్సవాలు, కల్యాణోత్సవం నిర్వహించాలని నిర్ణయిచారు.

కలెక్టర్‌పైనే ఆశలు..!

- పాఠశాలకు ప్రహరీలేక అవస్థలు
- ఇబ్బందులు పడుతున్న టీచర్లు, విద్యార్థులు
- రెండుసార్లు ప్రహరీ మంజూరైనా జరగని పనులు



ప్రహరీ లేని సంగారెడ్డి సంజీవనగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

సంగారెడ్డి అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణం సంజీవనగర్‌లో కొన్నేళ్లుగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కొనసాగుతున్నది. ప్రధాన రహదారికి కూతవేటు దూరంలో ఉన్న ఈ పాఠశాల చుట్టూ ప్రహరీలేమి పెద్ద సమస్యగా మారింది. ఈనెల 10న కలెక్టర్ వల్లూరు క్రాంతి ఈ పాఠశాలను సందర్శించారు. ఈ క్రమంలో ప్రహరీ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని హెచ్‌ఎం, టీచర్లు, విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు పాఠశాల వర్గాలు తెలిపాయి.

గతంలో మంజూరైనా చేపట్టని వైనం

ఇదే పాఠశాలకు గతంలో రెండుసార్లు ప్రహరీ మంజూరైందని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. అయితే పనులు ప్రారంభించకుండా కొందరు స్థానికులు అడ్డుకుంటుండడంతో పనులు ముందుకు సాగడం లేదని ఆ వర్గాలు వివరించాయి. సుమారు 2 వేలకుపైగా చదరపు అడుగుల సర్కారు స్థలం ఉన్నప్పటికీ ఇప్పటికే కొంత స్థలం ఆక్రమణకు గురైనట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ప్రహరీ నిర్మిస్తే ప్రభుత్వ పాఠశాలకు ఉపయుక్తంగా ఉండడంతో పాటు సర్కారు జాగా ప్రైవేటు పరం కాకుండా ఉండే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

ఈ పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో తరచూ విలువైన సామగ్రి చోరీకి గురవుతున్నది. రాత్రివేళలో పాఠశాల వరండాల్లో తాగిన మద్యం బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. మొత్తంగా అభద్రత నడుమ కొనసాగుతున్న ఈ పాఠశాలపై కలెక్టర్ దృష్టిసారించి ప్రహరీ మంజూరు చేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్: మైనంపల్లి



ఇఫ్తార్ విందుకు హాజరైన హన్మంతరావు

పాపన్నపేట/నర్సాపూర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మత సామరస్యానికి రంజాన్ ప్రతీకగా నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. బుధవారం సాయంత్రం పాపన్నపేటలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అంతకుముందు తిమ్మాయిపల్లిలో మల్లికార్జున స్వామి ఆలయ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్‌కుమార్, ఎంపీడీవో విష్ణువర్దన్, కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రమేష్‌గుప్తా, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అలాగే నర్సాపూర్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి నేతృత్వంలో బుధవారం సాయంత్రం స్థానిక షాదీఖానాలో ముస్లింలకు ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ హబీబ్‌ఖాన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు డీ.అంజిగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

100 శాతం ఇంటి పన్ను వసూలు చేయండి

- పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో ఆదేశం

మునిపల్లి/అమీన్‌పూర్/తూప్రాన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : గడువులోగా గ్రామాల్లో 10 0శాతం ఇంటి పన్ను వసూలు చేసి గ్రామాలాభివృద్ధికి తోడ్పాటునందించాలని ఎంపీడీవో డాక్టర్ హరినందన్‌రావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం మునిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో 100 శాతం ఇంటి పన్ను వసూలైంది. కానీ బుదేరా, కంకోల్, ఖమ్మంపల్లి గ్రామాల్లో 95 శాతం పూర్తయినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎండాకాలం ఉండడంతో నీటి ఎద్దడి లేకుండా చూడాలని కార్యదర్శులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీవో అండాలమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అంగద్ కుమార్, ఏపీవో యాదగిరి పాల్గొన్నారు. ఈనెలాఖరులోగా ఆస్తిపన్ను చెల్లించాలని అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆస్తి పన్ను సకాలంలో చెల్లించని వారికి వన్ టైం సెటిల్‌మెంట్ కింద బకాయిలపై విధించిన వడ్డీపై 90శాతం రాయితీ ఇస్తూ ప్రభుత్వం చక్కని అవకాశం కల్పించిందన్నారు. తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను ఆస్తి పన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి తెలిపారు.

రైతులు నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలి

- మెదక్ ఆర్డీవో రమాదేవి



ఎండిపోతున్న పంటను పరిశీలిస్తున్న ఆర్డీవో

నిజాంపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : భూగర్భ జల నీటిమట్టం పడిపోవడం వల్ల పంటలు నీటి ఎద్దడికి గురవుతున్నాయని, రైతులు అధైర్య పడకుండా నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి రైతులకు సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె బుధవారం సందర్శించి, ఎంపీడీవో, వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ముందుగా తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కేజీబీవీ పాఠశాల, తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణాలకు ప్రతిపాదించిన భూములను సందర్శించి, భూ యజమానులతో మాట్లాడారు. ఆమె వెంట ఇన్‌చార్జి తహసీల్దార్ రమ్యశ్రీ, ఎంపీడీవో రాజిరెడ్డి, ఏవో సోమలింగారెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రాథమిక స్థాయిలోనే నైపుణ్యాలు నేర్చుకోవాలి

- అదనపు ఎస్పీ మహేందర్

పాపన్నపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ప్రాథమిక స్థాయిలోనే మంచి నైపుణ్యాలను నేర్చుకుని ఉన్నతస్థాయిలో స్థిరపడాలని మెదక్ అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు. మంగళవారం రాత్రి మండల పరిధి పొడ్చాన్‌పల్లిలోని ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మహేందర్, డీఈవో రాధాకిషన్, డీఎస్పీ ప్రసన్నకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైమరీ స్థాయిలోనే చిన్నారులు పెద్ద వేదికపై భయం లేకుండా మాట్లాడడం, డ్యాన్స్‌లు చేయడం అద్భుతమన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజారెడ్డి, ఎంఈవోలు ప్రతాప్‌రెడ్డి, నీలకంఠం, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

- మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



ఆర్థిక సహాయం చెక్కు అందజేస్తున్న భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జొన్నల కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని స్థానిక మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కోరారు. బుధవారం నారాయణఖేడ్‌లో మాట్లాడుతూ రైతులు జొన్నను భారీఎత్తున సాగుచేశారని, ప్రభుత్వం జొన్నల కొనుగోలుకు క్వింటాల్‌కు రూ.3,370ల ధర ప్రకటించినప్పటికీ, కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదన్నారు. తమ ప్రభుత్వం జొన్నల కోత దశలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. అలాగే పెద్దశంకరంపేట మండలం మూసాపేటకు చెందిన విజయ్‌కు రూ.30 వేలు, ఖేడ్ మండలం తుర్కపల్లికి చెందిన చిరంజీవి తల్లికి రూ.11 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీఆర్‌ఎస్ కార్యాలయంలో భూపాల్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి శ్రేయారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్వర్, మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్ పాల్గొన్నారు. కాగా ఖేడ్‌లోని బిలాల్ మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నగేష్, తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి తైబజార్ వేలం రూ.10.67 లక్షలు

వెల్దుర్తి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వెల్దుర్తి గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి బలరాంరెడ్డి అధ్యక్షతన 2025-26 సంవత్సరానికి సంబంధించిన తైబజార్ వేలంను బుధవారం నిర్వహించారు. ఈ వేలంలో 9 మంది పాల్గొన్నారు. వెల్దుర్తికి చెందిన దండెం ఆదర్శ్ రూ.10.67 లక్షలకు తైబజార్‌ను దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి బలరాంరెడ్డి మాట్లాడుతూ... పంచాయతీలో నిర్ణయించిన ధరలే మార్కెట్లో తీసుకోవాలన్నారు.

విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలి

తూప్రాన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలని జిల్లా విద్యాధికారి ప్రొఫెసర్ రాధాకిషన్ పేర్కొన్నారు. బుధవారం తూప్రాన్ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తూప్రాన్ ప్రాథమిక పాఠశాలలో ప్రారంభమైన ఎఫ్‌ఎల్‌ఎన్-ఏఐ కృత్రిమ మేధ ల్యాబ్‌ను సందర్శించి ల్యాబ్‌లో ఉన్న విద్యార్థులను తెలుగు, గణితం గురించి అడిగి తెలుసుకున్నారు. తెలుగు పదాలను, వాక్యాలను విద్యార్థులచే చదివించారు. అనంతరం విద్యార్థులు రాసిన వర్క్ బుక్స్‌ను పరిశీలించారు.

దళితులపై దాడిచేసిన వారిని శిక్షించాలి

జోగిపేట రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : దళితులైన పల్లె సంజీవయ్య, అతడి కుమారుడిపై దాడిచేసిన సినీనిర్మాత మేడికొండ మురళీకృష్ణను చట్టరీత్యా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అతిమెల మాణిక్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన పలు దళిత సంఘాల నాయకులతో కలిసి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, ఆర్డీవో పాండుకు వినతిపత్రం అందజేశారు.

10 ఏళ్లుగా వంతెనకు నోచుకోని నాలా

- ఇబ్బంది పడుతున్న ప్రజలు



మూసానగర్-ఎన్జీవోస్ కాలనీల మధ్యలోగల నాలాపై వంతెన లేకపోవడంతో మూసివేసిన దృశ్యం

జహీరాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలోని మూసానగర్-ఎన్జీవోస్ కాలనీల మధ్యలో ఉన్న నాలాపై (బ్రిడ్జిని) వంతెనను ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. నాలా రెండున్నర మీటర్లు ఉండగా బఫర్ జోన్‌లో భాగంగా రెండువైపులా కలిసి ఐదు మీటర్లను వదిలేసి నిర్మాణాలను చేపట్టాల్సి ఉండగా.. అవేవీ పట్టించుకోకుండా నాలాపై అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. దీంతో మురుగునీరు ఇళ్ల మధ్యలోకి చేరడంతో అనారోగ్యాలకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మూసానగర్- ఎన్జీవోస్ కాలనీల మధ్యలోని నాలాపై బ్రిడ్జిని నిర్మించి, ఇబ్బందులు తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మొక్కజొన్న పంటల పరిశీలన

కోహీర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : 'అకాల వర్షం.. అపార నష్టం' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం మండలంలోని ఖానాపూర్, సజ్జాపూర్, కోహీర్, బడంపేట తదితర గ్రామాల్లోని నేలకొరిగిన మొక్కజొన్న పంటలను మండల వ్యవసాయ అధికారి నవీన్‌కుమార్, మండల విస్తీర్ణ అధికారులు శ్రీనివాస్, మౌనిక, సంధ్య పరిశీలించారు. పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించారు.

తునికి నల్లపోచమ్మ ఆలయం హుండీ లెక్కింపు

కౌడిపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పేరుగాంచిన తునికి నల్లపోచమ్మ ఆలయ హుండీని ఈవో రంగారావు ఆధ్వర్యంలో, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ పర్యవేక్షణలో బుధవారం లెక్కించారు. డిసెంబరు 13 నుంచి మార్చి 26 వరకు రూ.6,74,000 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. కరీంనగర్ జిల్లాకు చెందిన రాజరాజేశ్వరి సేవాసమితి మహిళలు హుండీ లెక్కింపును చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, పురోహితులు శివప్ప, అభివృద్ధి కమిటీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుచారి, మాజీ సర్పంచులు సాయగౌడ్, సాయిలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకే 'ఇందిరా మహిళా శక్తి'

జోగిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మహిళలను వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించిందని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ (అందోలు నియోజకవర్గ ప్రత్యేకాధికారి) గీత పేర్కొన్నారు. బుధవారం జోగిపేట పట్టణంలోని జీతన్‌బేగం అనే మహిళకు ఈ పథకం కింద మంజూరైన రూ.9.44 లక్షల విలువైన బేకరీ ఓవెన్‌ను పంపిణీ చేసి మాట్లాడారు. స్వయం సహాయక మహిళల ఆర్థిక స్వావలంబన కోసమే ప్రభుత్వం పథకాన్ని ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఎస్బీఐ మేనేజర్ నాగరాజు, మెప్మా టీఎంసీ భిక్షపతిగౌడ్, ఆర్పీ అనిత పాల్గొన్నారు.

'రక్తదానంతో ప్రాణదాతలుగా నిలుద్దాం'

సంగారెడ్డి రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రక్తదానంతో ప్రాణదాతలుగా నిలుద్దామని సంగారెడ్డి పట్టణ సీఐ రమేష్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ తనయుడు ప్రశాంత్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా బుధవారం సంగారెడ్డిలోని ప్రధాన ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంత్ మంచి భవిష్యత్తు ఉన్న యువకుడని చిన్న వయస్సులోనే మృతిచెందడం దురదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంవో డా.వీరంజానేయులు, డా.వెంకట్రామ్, బ్లడ్‌బ్యాంక్ ఇన్‌చార్జి మల్లయ్య పాల్గొన్నారు.

తల్లిదండ్రులను గౌరవించినప్పుడే జన్మధన్యం

నారాయణఖేడ్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులను గౌరవిస్తేనే జీవితం ధన్యమౌతుందని కేదార్‌నాథ్ ఆలయ ప్రధాన పూజారి శివలింగ స్వామి, మల్లన్నగుట్ట ఆలయ పీఠాధిపతి బసవలింగ అవదూతమహరాజ్ అన్నారు. ఖేడ్ మండలం చాప్టా.కెలో కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహ కార్యక్రమంలో బుధవారం పాల్గొని ప్రసంగించారు. తల్లిదండ్రులు దేవుళ్లతో సమానమన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

మెదక్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు పొందొచ్చని ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్‌సింగ్ అన్నారు. బుధవారం చిన్నశంకరంపేట మండలంలోని దర్పల్లి గ్రామంలో ఓ రైతుకు చెందిన ఐదెకరాలలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటి మాట్లాడారు. తక్కువ నీటితో పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు.

కలప వినియోగిస్తున్న పరిశ్రమపై చర్యలు

శివ్వంపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా కలప వినియోగిస్తున్న పరిశ్రమై చర్యలు తీసుకుంటామని నర్సాపూర్ ఎఫ్‌ఆర్‌వో అరవింద్ అన్నారు. మంగళవారం బిజిలీపూర్‌లోని ఓ పరిశ్రమ అనుమతులు లేకుండా కలప వినియోగిస్తున్నదన్న స్థానికుల సమాచారం మేరకు ఇన్‌చార్జి సెక్షన్ అధికారి సాయిరాం, బీట్ ఆఫీసర్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. సదరు పరిశ్రమకు జరిమానా విధిస్తామని అరవింద్ తెలిపారు.

నీడ లేదు.. నీళ్లు కరువు

5వ పేజీ తరువాయి

పనులు జరిగేచోట సౌకర్యాలు కల్పించలేదు. కవేలిలో కూలీలు ఇంటి నుండి తెచ్చుకున్న వాటర్ బాటిళ్లలో నీరు వేడిగా అయ్యాయని చూపించారు.

- ఝరాసంగం మండలం ఎల్గొయిలో పనులు జరిగేచోట టెంటు, మంచినీరు, ఫస్ట్‌ఎయిడ్ కిట్ లేవు.
- నారాయణఖేడ్ మండలంలోని 15 గ్రామాలలో మాత్రమే నీడ, నీటి వసతిని కల్పించారు. మిగితా గ్రామాల్లో ఎలాంటి వసతులు లేవు.
- జిన్నారం మండలం సోలక్‌పల్లి, ఊట్ల, రాళ్లకత్వ గ్రామాల్లో చలువ పందిళ్లు, నీటి వసతిని ఏర్పాటు చేశారు.
- కంది మండలంలోనూ ఉపాధి పనుల వద్ద మంచినీళ్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, నీడ సౌకర్యం ఉంది.
- వట్‌పల్లి మండలం దుద్దాల గ్రామంలో వసతులు లేనే లేవు.
- రాయికోడ్ మండలంలోని 31 గ్రామాల్లో 1958 మంది కూలీలు పనిచేశారు. ఎక్కడ కూడా ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించలేదు.
- సంగారెడ్డి మండలంలో పలుచోట్ల టెంట్లు, నీటి సౌకర్యం ఉండగా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో లేవు.
- కల్హేర్ మండలంలోనూ ఎండలోనే ఉపాధి కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.
- హత్నూర మండలంలోని మెజారిటీ గ్రామాల్లో నీడ, నీరు ఏర్పాటు చేయలేదు.
- పటాన్‌చెరు మండలంలో ఉపాధి కూలీలకు పనులు జరిగే చోట వసతులు కల్పించడం లేదు.
- మనూరు మండలంలో ఉపాధి కూలీలు వసతులు లేక ఎండ తీవ్రతను ఎదుర్కొంటున్నారు.
- సదాశివపేట మండలంలో కూలీలకు టెంటు సౌకర్యం లేదు. తాగునీటిని ఇళ్ల వద్ద నుండే తెచ్చుకుంటున్నారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఇవ్వడం లేదు.

మెదక్ జిల్లాలో..

- పెద్దశంకరంపేట మండలం బతుకమ్మకుంట వద్ద జరిగిన ఉపాధి పనుల్లో కూలీలకు ఎలాంటి వసతులు కల్పించలేదు.
- కౌడిపల్లి మండలంలో టెంట్లు ఇచ్చామని ఫీల్డ్ అసిస్టెంట్లు చెబుతున్నా అక్కడ మాత్రం కానరాలేదు. నీళ్లు ఉన్నాయి.
- అల్లాదుర్గం మండలం గొల్లకుంటలో నిర్వహిస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు.
- మాసాయిపేట మండలం బొమ్మారం, రామంతపూర్‌లో మంచినీరు, టెంటు, ఇతర వసతులు కల్పించడం లేదని కూలీలు చెప్పారు.
- చేగుంట మండలం మక్కరాజుపేటలో ఉపాధి కూలీలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు. నీళ్ల లేక ఇబ్బంది పడుతున్నారు.
- చిలప్‌చెడ్ మండలం జగ్గంపేటలో నీరు, నీడ, హెల్త్ కిట్ సౌకర్యం లేదని కూలీలు ఆవేదన చెందారు.
- టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లిలో నీడ వసతి లేక చెట్ల కింద సేద తీరారు. ఇంటి వద్ద నుండే మంచినీళ్లు తెచ్చుకున్నారు.
- తూప్రాన్ మండలం ఇమాంపూర్‌లో కూలీలకు కనీస వసతులు లేవు. గతంలో ఉన్నట్లుగా తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.
- చిన్నశంకరంపేట మండలంలోని గ్రామాల్లో ఉపాధి పనుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించకపోవడంపై కూలీలు మండిపడుతున్నారు.
- మనోహరబాద్ మండలం దేవరకుంటలో వసతులు కల్పించలేదు. మండలంలో సర్వర్ సమస్య కారణంగా కూలీల ఫోటోల కోసం ఒంటిగంట దాకా ఎండలోనే నిలబెడుతున్నారు.
- వెల్దుర్తి మండల పరిధిలోని గ్రామాల్లో ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు.
- హవేలి ఘన్‌పూర్ మండలంలోని గంగాపూర్ తండాలో చెట్టు నీడలోనే కూలీల వివరాలు తీసుకున్నారు. కనీస వసతులు లేవు.
- మెదక్ మండలం మక్తా భూపతిపూర్‌లో మంచినీటి సౌకర్యం కల్పించారు. టెంట్లు చిరిగిపోయి ఉన్నాయి. మెడికల్ కిట్స్ లేవు.
- రేగోడు మండలం కొండాపూర్‌లో 157 మంది కూలీలు పనిచేశారు. వారికి ఎలాంటి వసతులు కల్పించలేదు.

క్రైం కార్నర్

ఇంటిగోడ కూలి మహిళ మృతి

- పలువురికి గాయాలు

హత్నూర, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఇంటిగోడ కూలి ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని పన్యాలలో బుధవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన కొప్పుల శ్రీను భార్య మంజుల(49)తో పాటు కుమారుడు శ్రీకాంత్, కూతురు కావ్యశ్రీతో కలిసి ఇంట్లో నిద్రకు ఉపక్రమించారు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఇంటిగోడ కూలి నిద్రపోతున్నవారిపై పడటంతో శ్రీను, మంజుల, శ్రీకాంత్‌లకు తీవ్రగాయాలవగా, కూతురు కావ్యశ్రీ వారిని చూసి కేకలు వేశారు. దీంతో పక్క ఇంట్లో నిద్రిస్తున్న కుటుంబ సభ్యులు వెళ్లి చూశారు. గాయపడినవారిని వెంటనే చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ మంజులను పరీక్షించిన వైద్యులు ఆమె మృతిచెందినట్లు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుభాష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను దూషించిన యువకుల అరెస్ట్

మెదక్ అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో మహిళలను అసభ్య పదజాలంతో దూషించిన యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం పట్టణ సీఐ నాగరాజు వివరాల ప్రకారం.. స్థానిక సాయినగర్ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మహేష్‌కుమార్, నర్సఖేడ్‌కు చెందిన చింతల ప్రదీప్‌కుమార్ మంగళవారం రాత్రి మద్యం తాగారు. మత్తులో పాత బస్టాండ్ వద్ద హల్‌చల్ చేస్తూ.. మహిళలను దూషించారు. దాంతో మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం మహేష్‌కుమార్, ప్రదీప్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.